సాక్షి
విశాఖపట్నం
గురువారం । 5 । డిసెంబర్ । 2024



సాంకేతిక సృజనాత్మకత

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 'విశాఖ రీజనల్ పాలిటెక్ ఫెస్ట్'ను బుధవారం ఏర్పాటు చేశారు. 4లో



హిందువులపై దాడులు ఆపాలి

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను తక్షణం ఆపాలని కోరుతూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. 4లో

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని బీసీసీఐ సెలక్షన్ కమిటీ సభ్యుడు, మాజీ వికెట్ కీపర్ అజయ్ రత్రా బుధవారం దర్శించుకున్నారు.



న్యూస్‌రీల్

ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఆర్వో భవానీ శంకర్

మహారాణిపేట: ఊహించని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం విపత్తుల నిర్వహణ, ఇతర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్, డీఆర్వో భవానీ శంకర్, ఇతర విభాగాల అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో శిథిలావస్థకు చేరిన వంతెనలు, తోతట్టు ప్రాంతాల్లో ఉండే కాలువలు, రిటైనింగ్ వాల్స్, తుపాను షెల్టర్లు, కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజల వివరాలను సేకరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, **వరదలు,** తుపాన్లు, అగ్ని ప్రమాదాల పట్ల **అప్రమత్తంగా** ఉండాలన్నారు. అన్ని రకాల పరి**కరాలను, శిక్షణ,** నైపుణ్యం కలిగిన సిబ్బందిని అం**దుబాటులో ఉం**చుకోవాలని చెప్పారు.

ఇద్దరు జైల్ అధికారుల సస్పెన్షన్



కిశోర్ కుమార్



వెంకటేశ్వరరావు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేసి నాలుగు రోజుల క్రితం బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. జైలులో ఇటీవల పలు అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఎస్.కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్‌గా ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు. నాలుగు రోజుల క్రితం బదిలీల్లో ఎస్.కిశోర్‌కుమార్ అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు, ఎం.వెంకటేశ్వరరావు నెల్లూరు కారాగారానికి వెళ్లారు. కాగా జైల్లో ఘటనలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన పరిణామాలకు అధికారుల నిర్లక్ష్యం కారణమని నిర్ధారణైంది. దీంతో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ సంఘటనలకు సంబంధించి మరికొందరిపై కూడా విచారణ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

11న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 11న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కౌన్సిల్ సభ్యులకు 46 అంశాలతో రూపొందించిన అజెండా కాపీని బుధవారం అందజేశారు. మల్కాపురం, గాజువాక ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టుకు ప్రతిపాదించిన రూ.413 కోట్లకు అదనంగా మరో రూ.40 కోట్లు అవసరమవుతాయని, ఈ నిధులు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి వెచ్చించేలా అనుమతించాలని కోరుతూ ప్రతిపాదించారు. అదనపు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముడసర్లోవ గుర్రాల పార్కును రద్దు చేయాలని, 65వ వార్డులో రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదించారు. ఏలేరు కాలువ పూడికతీత పనులు, పంపింగ్ కోసం రూ.1.50 కోట్లు వెచ్చించాలనే అంశాన్ని అజెండాలో చేర్చారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పొందుపరిచారు. క్రీడా ప్రాంగణాలకు సంబంధించి సభ్యత్వ రుసుంలు, అద్దెలు, ఇతర రుసుంలు విధించాలని, చంద్రంపాలెం పాఠశాల విద్యార్థుల కోసం హైవేపై నడక వంతెన నిర్మించాలని, భీమిలి జోన్ 1, 2 వార్డుల్లో రహదారులు విస్తరణ పనులకు ప్రతిపాదించారు.

యూపీహెచ్‌సీల్లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ)లో పలు పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఏడాది కాలానికి భర్తీ చేస్తామని, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం నియామకాలు చేపడతామని అందులో పేర్కొన్నారు. ఫార్మాసిస్ట్ గ్రేడ్-2(2), ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2(2), డీఈవో(6), లాస్ గ్రేడ్ సర్వీసెస్(1) పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 10వ తేదీలోగా రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, మరిన్ని వివరాలకు https:// visakhapatnam. ap. gov. in/ సందర్శించాలని ఆయన సూచించారు.

అమర వీరులకు ఘన నివాళి

ఏయూక్యాంపస్ : నేవీ డే సందర్భంగా బుధవారం ఉదయం బీచ్ రోడ్డులోని అమర వీరుల స్థూపం వద్ద తూర్పు నావికాదళం సబ్‌మెరైన్స్ ఫ్లాగ్ ఆఫీసర్ రీర్ అడ్మిరల్ చేతన్ చందెగవే పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగం మరువలేమని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నేవీ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, విశ్రాంత రీర్ అడ్మిరల్ టి.సుధాకర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం పాల్గొని అమరవీరులకు స్మృత్యంజలి ఘటించారు.



విక్టరీ ఎట్ సీ వద్ద నేవీ అధికారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, **జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్**



గౌరవ వందనం సమర్పిస్తున్న సైనికులు

సిరులతల్లి... ప్రణమిల్లి

తొలి గురువారం పూజలు ప్రారంభం

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి సన్నిధిలో తొలి గురువారం పూజలు బుధవారం అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ పూజలను ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు స్వర్ణాభరణ అలంకరణలోనే భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచం తొడిగారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు అర్ధరాత్రి నుంచి తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.



స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి

టార్గెట్లు.. వేధింపులు



తీవ్ర ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరవుతున్న సచివాలయ ఉద్యోగులు

కూటమి నేతల తీరుతో అడుగడుగునా అవమానాలు

ప్రక్షాళన పేరుతో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

గతమెంతో ఘనం.. వర్తమానం అధ్వానం అన్నట్లుగా **తయారైంది గ్రామ**/వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి. వైఎస్ జగన్ **మోహన్‌రెడ్డి మార్క్ కని**పించకుండా సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసి.. అస్తవ్యస్తం చేస్తోంది. వలంటీర్లను పక్కన బెట్టి.. వారి పనులన్నింటినీ ఉద్యోగుల నెత్తిన పెట్టడమే కాకుండా రోజుకో కొత్త బాధ్యతను అప్పగిస్తూ వేధింపులకు గురి చేస్తోంది. సర్వేల పేరుతో తీవ్ర పని ఒత్తిడి, కూటమి నాయకుల చిన్నచూపు, ప్రజల మధ్య అవమానాలు, వేధింపులతో ఉద్యోగులు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. తాజాగా షోకాజ్ నోటీసులు, హాజరు ప్రక్రియలో మార్పు వారిని మరింత ఒత్తిడిలోకి నెట్టింది. కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలతో జిల్లాలోని 4,300 మంది ఉద్యోగులు అల్లాడిపోతున్నారు.

మహారాణిపేట : పరిపాలన వ్యవస్థలో కీలకంగా మారిన గ్రామ/వార్డు సచివాలయాలను నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం బలంగా పనిచేస్తోంది. ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను చేర్చిన బృహత్తర కార్యక్రమాన్ని భ్రష్టుపట్టించే కుతంత్రాలకు నిరంతరం పదునుపెడుతోంది. ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాల్సిన చంద్రబాబు ప్రభుత్వం ఆ పని చేయకపోగా.. తిరిగి వారిపైనే కత్తి దూస్తోంది. వలంటీర్లు లేకుండానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పుకునేందుకు ఆపసోపాలు పడుతోంది. చంద్రబాబు ప్రభుత్వ శాడిజానికి సచివాలయ ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అవమానాలు తట్టుకుని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తుంటే.. చిన్న చిన్న కారణాలతో షోకాజ్ నోటీసులిచ్చి కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. తాజాగా సచివాలయాల సిబ్బంది హాజరుపైనా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇక నుంచి ఉద్యోగులు వారి అటెండెన్స్ మొబైల్ యాప్‌లో సచివాలయానికి వచ్చిన సమయం, వెళ్లిన సమయం రెండూ నమోదు చేయాలని పేర్కొంది. ఒకే ఎంట్రీ ఉంటే ఆ రోజు ఉద్యోగి సెలవుగా పరిగణిస్తామంటూ సందేశాలు పంపించింది.

జిల్లాలో మొత్తం గ్రామ/వార్డు సచివాలయాలు	607
జీవీఎంసీ పరిధిలో	551
గ్రామీణ ప్రాంతాల్లో	56
మొత్తం ఉద్యోగులు	4,300

సర్వేలతో ఉక్కిరిబిక్కిరి



సచివాలయంలో పింఛన్ల కోసం వేలిముద్రలు వేస్తున్న వృద్ధులు

గతంలో జాబ్‌చార్ట్ ప్రకారం ఉద్యోగులు కార్యకలాపాలు నిర్వర్తించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. నెల మొదటిరోజు ఉదయం 4 నుంచి ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాల్సి వస్తోంది. ఓడీఎఫ్ సర్వేలో బాత్‌రూమ్ ఫొటోలు తీయిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పల్స్ సర్వేలో కుళాయిల ఫొటోలు తీయడంతో పాటు ఉదయం 6 గంటలకు పారిశుద్ధ్య తీరును పరిశీలించాల్సి ఉంది. 100 రోజుల హౌస్ హోల్డ్ సర్వే, ఇంటింటికీ స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేసే విధులు, విజన్ 2047 పేరుతో సర్వే వంటివి సచివాలయ ఉద్యోగులతో నిర్వర్తిస్తున్నారు. హౌస్ టూ హౌస్ జియో ట్యాగింగ్ చేయిస్తున్నారు. అలాగే ఎంఎస్‌ఎంఈ సర్వే, ప్రజా ఫిర్యాదులపై వెరిఫికేషన్(పీజీఆర్ఎస్) సర్వే, ఎన్‌పీసీఐ లింక్(బ్యాంకు లింక్) వంటి కార్యక్రమాలన్నీ వీరితోనే చేపడుతున్నారు. ఒకేసారి నాలుగైదు సర్వేలు చేయించడమే కాకుండా.. టార్గెట్లు ఇచ్చి ఒత్తిడికి గురిచేస్తున్నారు.

ఉద్యోగులపై కత్తి

దిగువస్థాయి అధికారులు ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. జాబ్‌చార్ట్‌కు సంబంధం లేని అనవసరమైన పనులు అప్పగించి ఒత్తిడికి గురి చేస్తున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అధికారులు వింత పోకడతో సచివాలయ ఉద్యోగులకు ప్రోగ్రెస్ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని జిల్లా గ్రామ సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డు పరిపాలన కార్యదర్శులకు ఒకవైపు హౌస్ జియో ట్యాగింగ్ వర్క్ టార్గెట్లు ఇస్తూ.. మరోవైపు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ వసూళ్లను పెంచాలని సమావేశాలు పెడుతూ ఉద్యోగులను మానసికంగా క్షోభ పెడుతున్నారు. వెల్ఫేర్ సెక్రటరీలకు ఎన్‌పీసీఐ(బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ) వంటి విధులు కేటాయిస్తూ టార్గెట్ పూర్తి చేయాలని మెమోలు జారీ చేసి వేధింపులు గురి చేస్తున్నారు.



వినతి పత్రం స్వీకరిస్తున్న సచివాలయం కార్యదర్శి

అలాగే హౌసింగ్ రీ వెరిఫికేషన్ విధులను కూడా కేటాయించారు. ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి పౌరులకు డిజిటల్ సేవలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే పని అప్పగించారు. అదనంగా జియో ట్యాగింగ్ పనులు కూడా కేటాయించారు. అదనంగా శాఖాపరమైన విధులను నెత్తిన రుద్ది మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇన్ని పనులు చేస్తున్నప్పటికీ.. పనులు సక్రమంగా జరగడం లేదని అధికారులు పరుష పదజాలంతో మాట్లాడటం, గంట గంటకు గూగుల్ షీట్ నింపడం వంటివి చేయడం వల్ల ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారు.

మానసిక క్షోభకు గురి చేస్తున్నారు..



ఒకే సమయంలో పలు రకాల పనులు అప్పగిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. మాకు ఒత్తిడి నుంచి పూర్తిగా విముక్తి కల్పించాలి. ఆరోగ్యకరమైన వాతావరణంలో పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– **బీవీ అశోక్ కుమార్**, సచివాలయ ఉద్యోగి

ఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలి



ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేని విధంగా సచివాలయ ఉద్యోగులకు మాత్రమే బయోమెట్రిక్ హాజరు పెట్టి దాన్ని జీతంతో అనుసంధానం చేయడం దారుణం. బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు అదనంగా పనులు అప్పగించడం అన్యాయం. ఒక సమయంలో ఒకే పని ఇస్తూ మానసిక క్షోభ, ఒత్తిడి నుంచి విముక్తులను చేయాలి.

– పి.జి.గణేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సంబంధం లేని పనులు అప్పగింత



జాబ్‌చార్టుకు సంబంధం లేని పనులు అప్పగిస్తున్నారు. ప్రోగ్రెస్ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారు. ఒక పక్క హౌస్ జియో ట్యాగింగ్ వర్క్‌లో టార్గెట్లు ఇస్తున్నారు. ఇంకో వైపు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు పెంచాలని కోరుతున్నారు. పైగా వీటిపై ఏకధాటిగా సాధారణ మీటింగ్‌లు, జూమ్ మీటింగ్‌లు పెడుతున్నారు.

– సాయికృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగి

అనారోగ్యానికి గురవుతున్నాం



ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగింది. మాకు సంబంధం లేని అనేక ప్రభుత్వ శాఖల పనులు అప్పగిస్తున్నారు. కొంత మంది అధికారులు పలు రకాలుగా వేధిస్తున్నారు. ఉద్యోగిగా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. కాని అన్ని పనులు అప్పగించడం వల్ల పని ఒత్తిడి పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నాం.

– చింతకాయల బంగార్రాజు, ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్, గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ఏఐతో ట్రాఫిక్ నియంత్రణ

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- వెహికల్ పార్కింగ్ ఎరీనా ప్రారంభం

విశాఖ సిటీ : నగరంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డ్రివెన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో అసంపూర్తిగా ఉన్న వెహికల్ పార్కింగ్ ఎరీనాను జీవీఎంసీ ఆర్థిక సహకారంతో 150 టూ వీలర్స్, 20 ఫోర్ వీలర్స్ పార్కింగ్‌కు అనుగుణంగా పూర్తి చేశారు. దీన్ని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ పోలీస్ శాఖకు అన్ని విధాల సహకారం అందిస్తున్నారని తెలిపారు. స్నిఫర్ డాగ్స్ ఇవ్వడంతో పాటు సీసీ కెమెరాలు, లైటింగ్ వంటి సదుపాయాలు కల్పించారని వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఏఐ డ్రివెన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఫేస్ రికగ్నైజేషన్, నంబర్ రికాగ్నైజేషన్) ఏర్పాటుపై దృష్టి పెట్టినట్లు వివరించారు. దీనికి కూడా జీవీఎంసీ కమిషనర్ సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు చెప్పారు. వీటి ఏర్పాటు కోసం ఇప్పటికే 7 కంపెనీలు ముందుకు వచ్చాయని, వాటితో పాటు ఒక ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసి కమిషనర్ వద్దకు తీసుకువెళతామన్నారు.



పార్కింగ్ ఎరీనాను ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, సీపీ బాగ్చి

ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే ఈ సాంకేతికత ద్వారా గుర్తించి వారి లైసెన్సులు తాత్కాలికంగా రద్దు చేయడం, చలానాలు విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ సీపీ తనకు చాలా కాలంగా తెలుసని, అతనితో కలిసి పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. జీవీఎంసీకి ఆయన అనేక ప్రతిపాదనలు ఇచ్చారని, అయితే ఎవరో ఒకరు ఆర్థికంగా ముందుకు వస్తే తప్పా అవి పరిష్కారం కావన్నారు. గణేష్ నిమజ్జనం నుంచి నగరంలో అన్ని భారీ కార్యక్రమాలు జీవీఎంసీ, పోలీస్ శాఖ ఉమ్మడిగా చేస్తున్నాయని వివరించారు. సీసీ కెమెరాల ప్రతిపాదన నగరానికి కీలకమన్నారు. అలాగే టోయింగ్ వెహికల్‌ను సీఎస్ఆర్ నిధుల నుంచి అందిస్తామని, రెండో టోయింగ్ వెహికల్‌ను వచ్చే ఏడాదిలో సమకూరుస్తామన్నారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

మహారాణిపేట: రెండు రోజుల విశాఖ పర్యటన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం విశాఖ వస్తున్నారు. గురువారం రాత్రి 9.30 గంటలకు ముంబయి నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రామ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయానికి చేరుకొని అక్కడ రాత్రి బస చేస్తారు. శుక్రవారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేడు సీఎస్ రాక : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ గురువారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో గురువారం ఉదయం 8.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం నగరంలో ఒక ప్రైవేటు హోటల్‌లో జరగనున్న డీప్‌టెక్, గవర్నమెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్-2024లో పాల్గొంటారు.

నలుగురు మంత్రుల రాక

రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, టి.జి.భరత్, డోలా బాల వీరాంజనేయులు, సత్యప్రసాద్ గురువారం విశాఖ వస్తున్నారు. 6వ తేదీన సీఎం చంద్రబాబుతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 7వ తేదీన ఆరోగ్య మంత్రి సత్యప్రసాద్ నగరంలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని సందర్శిస్తారు. అనంతరం విజయనగరం జిల్లా వెళ్తారు. మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశానికి హాజరవుతారు.

స్నేహితురాలిపై పెట్రోల్ పోసి నిప్పు

- 65 శాతం గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స
- అక్కయ్యపాలెంలో కలకలం రేపిన ఘటన
- బాధితురాలు అంగన్‌వాడీ కార్యకర్త

సీతమ్మధార: ఇద్దరు మహిళలు స్నేహితులు. ఎన్నో ఏళ్లుగా వారి మధ్య బలమైన అనుబంధం ఉంది. ఏమైందో తెలియదు.. అందులో ఓ మహిళ మరో మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. బాధితురాలు మాత్రం ప్రమాదవశాత్తూ కాలిపోయానని పోలీసులకు వాంగ్మూలం ఇవ్వగా.. ఆమె భర్త, కుటుంబ సభ్యులు స్నేహితురాలే హత్యాయత్నం చేసిందని ఫిర్యాదు చేశారు. అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో బుధవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి తెలిపిన వివరాలివీ.. అక్కయ్యపాలెం పెదూద్రికి చెందిన రహీం మనీషా బేగం శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తున్నారు. గోపాలపట్నానికి చెందిన సంగీత, బేగం ఇద్దరు స్నేహితులు. డిగ్రీ నుంచి వారి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. కాగా.. బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో సంగీత.. బేగంకు ఫోన్ చేసి కేంద్రం బయటకు రమ్మని చెప్పింది. గోపాలపట్నం నుంచి ద్విచక్రవాహనంపై అక్కయ్యపాలెం వచ్చిన సంగీత దగ్గరకు బేగం వెళ్లింది. వీరిద్దరూ సమీపంలో ఆటోలో కూర్చొని మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తన వెంట తెచ్చుకున్న పెట్రోలను బేగంపై పోసి, నిప్పంటించి సంగీత అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఫోర్త్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 65 శాతం కాలిపోయిన బేగంను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఘటనా స్థలం నుంచి పరారైన సంగీతను మార్గమధ్యలో అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా.. అంగన్‌వాడీ కార్యకర్త భర్త ఆదం తన భార్యపై హత్యాయత్నం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు హత్యాయత్నం కేసుగా నమోదు చేసి నిందితురాలిని మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆమె గోపాలపట్నంలో పెట్రోల్ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఆర్థిక లావాదేవీల విషయమై కొంతకాలంగా వారి మధ్య విభేదాలు ఉన్నట్లు సమాచారం. సీఐ ఎస్.విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రహీంమనీషా బేగం



కాలిన గాయాలతో రహీం మనీషా బేగం

సీఎస్‌బీకి 11 మంది సిబ్బంది

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఏఎస్ఐలు, 9 మంది హెడ్‌కానిస్టేబుళ్లను సిటీ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న టి.శివకృష్ణ, సైబర్ క్రైమ్‌లో ఉన్న ఏఎస్ఐ జి.సత్యనారాయణను సీఎస్‌బీకి పంపించారు. అలాగే పలు స్టేషన్లలో హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉన్న 9 మందిని స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

బీచ్‌రోడ్డు: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మాధవి తెలిపారు. ఈ జాబితా https:// visakhapatnam. ap. gov. in/ లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈ నెల 18వ తేదీలోగా రాతపూర్వకంగా తమ కార్యాలయానికి అందజేయాలని కోరారు. అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. పారదర్శకంగా తుది ఎంపిక ఉంటుందని, బయట వ్యక్తుల మాటలు విని మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు.

బీటెక్ పరీక్ష వాయిదా

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న జరగాల్సిన బీటెక్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ టి.చిట్టిబాబు తెలిపారు. ఆ రోజు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉన్నందున విద్యార్థుల సౌకర్యార్థం ఈ వెసులుబాటు కల్పించామన్నారు. వాయిదా వేసిన పరీక్షను ఈ నెల 16న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ బుధవారం తీర్పు చెప్పారు. 2018 మార్చి 20న నర్సీపట్నం ప్రాంతంలోని కృష్ణదేవిపేట దగ్గర కిల్లో జన్, కిల్లో కమల, కిల్లో సీత 50 కిలోల గంజాయి కలిగి ఉండగా.. గొలుగొండ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. సీఐ మధుకుమార్ ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారని అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాద్‌రావు తెలిపారు.

ముగిసిన పరఖ్ సర్వేక్షణ్ పరీక్ష

విశాఖ విద్య: జిల్లాలో 142 కేంద్రాల్లో బుధవారం జరిగిన పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష విజయవంతంగా ముగిసినట్లు డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. 142 మంది ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లు ఆధ్వర్యంలో సీబీఎస్ఈ ప్రతినిధుల సమక్షంలో పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. మూడో తరగతి 1,096 మంది, 6వ తరగతి 1,267 మంది, 9వ తరగతి 1,447 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. చంద్రపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆర్జేడీ విజయ భాస్కర్, తోటగరువు స్కూల్‌ను డీఈవో సందర్శించారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మహారాణిపేట: జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేశామని, ఇందుకు సంబంధించి అధికార బృందాలను నియమించినట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్ తెలిపారు. ఈ నెల 6 నుంచి జిల్లా వ్యాప్తంగా 156 గ్రామాల్లో సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా బుధవారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. సదస్సు నిర్వహణలో భాగంగా ప్రతి మండలానికి ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించామని, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిపి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 11 మండలాల పరిధిలో గుర్తించిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుపై ఇప్పటికే క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. డీఆర్వో భవానీ శంకర్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాంకేతిక సృజనాత్మకత

మారుతున్న సాంకేతిక వ్యవస్థలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మారాల్సిందే. విద్యార్థి దశ నుంచే సాంకేతిక భావనలను పెంపొందించుకోవాల్సిందే.. లేదంటే వెనుకబడిపోతారు. అందుకే విద్యార్థులకు నేటి సాంకేతిక మార్పులపై అవగాహన పెంపొందించి.. రానున్న తరాన్ని మరింత ఇన్నోవేటివ్‌గా తయారు చేయాలనే ఉద్దేశంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం 'విశాఖ రీజినల్ పాలిటెక్ ఫెస్ట్'ను ఏర్పాటు చేశారు. ఈ ఫెస్ట్‌లో విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టి.. నూతన ఆవిష్కరణల నమూనాలను ప్రదర్శించారు. జీవితంలోని ప్రతి మలుపును సాంకేతికతతోఅనుసంధానిస్తూ వారు రూపొందించిన నమూనాలు సందర్శకులను ఆలోచింపజేశాయి. – మురళీనగర్

పరిశ్రమల్లో గ్యాస్ లీకేజీని పసిగట్టేస్తుంది

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన డ్రోన్ టెక్నాలజీ ద్వారా పరిశ్రమల్లో విషవాయువుల లీకేజీలను ముందే గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చు. రియల్ టైమ్ పర్యవేక్షణ ద్వారా సమాచారాన్ని సేకరించి, విషపూరిత గ్యాస్ లీక్ అయినప్పుడు దాని గాఢతను తగ్గించడానికి పేలోడ్‌ను వినియోగిస్తారు. దీని వల్ల ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. ఈ డ్రోన్‌ను అగ్నిమాపక, వ్యవసాయం, జీపీఎస్, ఉష్ణోగ్రత కొలతలు వంటి రంగాల్లో వినియోగించవచ్చు. డాక్టర్ బి.వి. లక్ష్మణరావు మార్గదర్శకత్వంలో పి.భవానీశంకర్, ఆర్.హైడిరాజు, ఎస్.కె.అబ్దుల్ రజాక్, టి.ప్రనూష్ రూ.25 వేలు ఖర్చు చేసి ఈ పరికరాన్ని రూపొందించారు.


విద్యార్థులు రూపొందించిన డ్రోన్

సరకుల షిఫ్టింగ్‌లో నష్ట నివారణ


ప్రోటోటైప్ కన్వేయర్ బెల్ట్‌తో విద్యార్థులు

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు కన్వేయర్ బెల్ట్ ద్వారా భారీ వస్తువుల షిఫ్టింగ్‌ను సులభతరం చేసి, ప్రమాదాలను నివారించేందుకు నూతన విధానాన్ని ఆవిష్కరించారు. ఇందుకోసం ప్రోటోటైప్ కన్వేయర్ బెల్ట్‌లో వీఎఫ్‌డీ (వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్), పీఎల్‌సీ (ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్), సేఫ్టీ లైట్ కర్టెన్‌లను ఉపయోగించారు. దీని ద్వారా లోడింగ్ సమయంలో బెల్ట్‌కు ఏర్పడే అడ్డంకులను ముందే గుర్తించవచ్చు. బెల్ట్ అనుకోకుండా తెగిపడితే వీఎఫ్‌డీని ఉపయోగించి దాన్ని నియంత్రించవచ్చు. ఈ విధానం ద్వారా 2వేల పారామీటర్ల వరకు కంట్రోల్ చేసి ప్రమాదాలను నివారించవచ్చు. కె.వి.సుబ్రమణ్యేశ్వరరావు మార్గదర్శకత్వంలో కె.నాగదుర్గ, కె.అభిరామ్, కె.ఎస్.కె.ఎస్ యోషిక్, కె.మోహన్ ప్రీస్‌లు రూ.50వేల ఖర్చుతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు.

స్మార్ట్ సిటీకి క్లీన్ ఎనర్జీ


స్మార్ట్ సిటీ ప్రాజెక్టు

స్మార్ట్ సిటీగా రూపొందించే ప్రయత్నంలో భాగంగా క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించి సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఆసక్తి కలిగించింది. డి. కిశోర్‌కుమార్ మార్గదర్శకత్వంలో జి.దివ్య, జె.ప్రియాంక, సీహెచ్.అనూషారెడ్డి, కె.జయజ్యోతి ఈ ప్రాజెక్టును రూ.3 వేలతో రూపొందించారు. స్వచ్ఛ నగర నిర్మాణంలో భాగంగా సేకరించే చెత్తను వివిధ రకాలుగా ఉపయోగించుకోవచ్చని విద్యార్థులు చెబుతున్నారు. ముఖ్యంగా పునర్వినియోగపరచలేని ఘన వ్యర్థాల నుంచి బయోగ్యాస్, విద్యుత్, నూనెను ఉత్పత్తి చేయవచ్చని తెలియజేస్తున్నారు.

హెల్మెట్ ధరిస్తేనే బండి స్టార్ట్

భీమిలి మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నుంచి షబ్నం పర్వీన్ మార్గదర్శకత్వంలో బి.మేరియా అక్షిత, సీహెచ్ మాధురి, జీఎస్ శిరిలక్ష్మి కేవలం రూ. 3,500తో ఒక స్మార్ట్ హెల్మెట్‌ను రూపొందించారు. ఈ హెల్మెట్‌ను ధరించకపోతే వాహనం ఇంజిన్ స్టార్ట్ అవ్వదు. అంతేకాకుండా, ఈ విషయం వారి కుటుంబ సభ్యుల ఫోన్‌కు మెసేజ్ రూపంలో వెళుతుంది. అలాగే చోదకుడు ఆల్కహాల్ సేవించి బండి నడిపితే ఆల్కహాల్ సెన్సార్ నుంచి నేరుగా ఇంట్లో మొబైల్‌కు సమాచారం వెళుతుంది. పరిమితికి మించి వేగం పెంచినా తెలిసిపోతుంది. ఇందుకోసం వీరు జీపీఎస్ మాడ్యూల్, జీఎస్ఎం మాడ్యూల్, ఎంక్యూ 3 ఆల్కహాల్ సెన్సార్, ఆర్ఎఫ్ ట్రాన్స్ మీటర్, రిసీవర్‌ను వాడారు.


స్మార్ట్ హెల్మెట్ ప్రాజెక్ట్‌తో విద్యార్థులు

కొత్త బోన్ సృష్టిస్తాం

మన శరీరంలోని అసలు ఎముకల మాదిరిగానే కొత్త ఎముకలను తయారు చేసి, వాటిని శరీరంతో అనుసంధానిస్తామని చెబుతున్నారు కంచరపాలెం మెటలర్జీ విద్యార్థులు. హైడ్రాక్సీ ఎపటైట్(హెచ్‌వోపీ) ద్వారా ఈ విధానం సాధ్యమవుతుందని అంటున్నారు. ఇందుకోసం వారు రూ.25,000 ఖర్చు చేసిన ఒక ప్రింటింగ్ మెషీన్‌ను రూపొందించారు. పి.అక్షయ, బి.గాయత్రి, జె. ఆదర్శరెడ్డి, ఎన్.అభిషేక్‌లు ఈ మెషీన్‌ను రూపొందించగా, పి.రాజేంద్రబాబు వారికి మార్గదర్శకత్వం వహించారు. తొలగించిన ఎముక స్థానంలో హెచ్‌వోపీతో తయారు చేసిన కొత్త ఎముకను అమర్చి, జీవితాంతం కొనసాగే ఒక పరిష్కారాన్ని అందించవచ్చు.


బయో ఇన్ ప్లాంట్ బోన్ ప్రింటింగ్ మెషీన్

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

బీచ్ రోడ్డులో హిందూ సంఘాల ర్యాలీ

ఏయూక్యాంపస్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను తక్షణం ఆపాలని కోరుతూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఆర్‌కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ప్రపంచ హిందువులంతా ఏకం కావాలని, ఇస్కాన్ స్వామీజీ చిన్మయ దాస్‌ను వెంటనే విడుదల చేయాలని నినదించారు. సమానత్వం, న్యాయం కోసం స్వామి చిన్మయదాస్ పోరాటం మహోన్నతమన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వం హిందువులకు రక్షణ కల్పించకపోగా, చిన్మయదాస్ వంటి వారిని అరెస్టు చేయడం శోచనీయమన్నారు. దీనిపై మేధావులు, సెలబ్రిటీలు, మానవ హక్కుల కార్యకర్తలు వెంటనే స్పందించాలని కోరారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ మాట్లాడుతూ మానవ హక్కులను హరించేలా బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉన్నాయన్నారు. చిన్మయదాస్‌ని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారత్ మాతాకీ జై నినాదాలతో బీచ్ రోడ్డు హోరెత్తింది. ప్లకార్డులు, కాషాయ జెండాలను పట్టుకుని పెద్ద సంఖ్యలో హిందూ సంఘాల సభ్యులు, మహిళలు, బీజేపీ నాయకులు, నగర వాసులు ర్యాలీలో పాల్గొన్నారు.


బీచ్ రోడ్డు ర్యాలీ చేస్తున్న హిందూ సంఘాల సభ్యులు, నగర ప్రజలు

సమస్యలు పరిష్కరించకపోతే 19 నుంచి సమ్మె

మహారాణిపేట: 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలను ఈ నెల 18వ తేదీలోగా పరిష్కరించాలని 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు కోరారు. లేకపోతే 19వ తేదీ నుంచి సమ్మెకు దిగడానికి కూడా వెనుకాడబోమని ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే సమ్మె విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులకు తెలియజేశామని, అయినా స్పందన రాలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో సమ్మె నోటీసు ఇచ్చినా విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 7 పీహెచ్‌సీల్లో మొత్తం ఏడు వాహనాల్లో 14 మంది ఉద్యోగులు, అదనపు వాహనంలో ఇద్దరు కలిపి మొత్తం 16 మంది పనిచేస్తున్నట్లు చెప్పారు. 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమను వైద్య ఆరోగ్యశాఖ, ఇతర శాఖల్లో కాంట్రాక్ ఉద్యోగులుగా నియమించాలని, సీనియర్ డ్రైవర్లకు శ్లాబుల ప్రకారం వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పలు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్(08557/08558), విశాఖపట్నం-షాలిమర్ (08508/08507), సంబల్‌పూర్-ఈరోడ్(08311/08312), భువనేశ్వర్-యశ్వంత్‌పూర్(02811/02812) వీక్లీ ఏసీ స్పెషల్ ను ఆయా తేదీల్లో నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో అమరావతి ఎక్స్‌ప్రెస్

షాలిమర్-వాస్కోడగామా-షాలిమర్ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్-వాస్కోడగామా(18047) అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, వాస్కోడగామా-షాలిమర్(18048) అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 19 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆయా తేదీల నుంచి ఈ రైలు సెకండ్ ఏసీ-1. థర్డ్ ఏసీ-4, స్లీపర్ క్లాస్-9, జనరల్ సెకండ్ క్లాస్ -4. సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ, జనరేటర్ మోటార్‌కార్ కోచ్‌లతో నడుస్తుంది.

రేపటి నుంచి ప్రజా రవాణా వ్యవస్థ జాతీయ క్రీడా పోటీలు

డాబాగార్డెన్స్: ప్రజా రవాణా వ్యవస్థ ఉద్యోగుల క్రీడా సంబరాలకు విశాఖ సిద్ధమవుతోంది. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణం వేదికగా ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను సజావుగా నిర్వహించేందుకు ఏపీఎస్ఆర్టీసీ జోన్-1 ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ నేతృత్వంలో రెండు సార్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. క్రీడాకారులకు స్వాగతం, రవాణా, వసతి, ఆహార పంపిణీ, క్రీడా ప్రాంగణం, మెడికల్, సెక్యూరిటీ తదితర ఏర్పాట్లపై పలు కమిటీలతో సమీక్షించి, పలు ఆదేశాలు జారీ చేశారు.

గోపాలపట్నంలో ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

గోపాలపట్నం: గోపాలపట్నంలో ఎస్ఆర్ షాపింగ్‌మాల్ వస్త్ర దుకాణాన్ని బుధవారం సినీ హీరో కిరణ్ అబ్బవరం, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల్ యజమాని గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 13వ బ్రాంచ్ ఏర్పాటు ద్వారా ఎస్ఆర్ షాపింగ్‌మాల్ వినియోగదారులకు మరింత చేరువైందన్నారు. నాణ్యమైన వస్త్రాలు, అత్యధిక కలక్షన్లతో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ గోపాలపట్నం ప్రాంతం వ్యాపార పరంగా అభివృద్ధి చెందడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

కిరణ్ అబ్బవరం సందడి : విశాఖతో తనకు మంచి అనుబంధముందని సినీ హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు. 'క' సినిమాను అందరూ ఆదరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కథా పరంగా అవకాశమొస్తే భిన్నమైన పాత్రలు చేస్తానన్నారు. తాను నటిస్తున్న రెండు సినిమాల పూర్తి వివరాలను ఫిబ్రవరి తరువాత వెల్లడిస్తామని తెలిపారు.



బ్లేజర్‌ను పరిశీలిస్తున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

వైశ్యరాజు జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

తుని: స్థానిక బాలాజీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యువెలర్స్ షోరూంను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా సూర్యనారాయణ మొదటి కొనుగోలు చేశారు. అనంతరం షోరూంలోని ఆభరణాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తిలకించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొట్టమొదటిగా తునిలో షోరూం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను ఫ్లాట్ ఆరుశాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు లేదన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, చెక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు పాల్గొన్నారు.


తునిలో షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

హైటెన్షన్ వైర్లు తగిలి బాలుడి మృతి


సాత్విక్ కుమార్ మృతదేహం

గాజువాక: విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగలడంతో ఓ బాలుడు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు కణితి గవర వీధిలో నివాసముంటున్న ఉక్కు ఉద్యోగి దాడి దిలీప్ కుమార్ చిన్న కుమారుడు సాత్విక్ కుమార్ (10) ఇంట్లో ఉన్న విద్యుత్ సీరియల్ లైట్లతో బుధవారం ఆడుకొంటున్నాడు. ఆ వైరును తిప్పుతున్న క్రమంలో ఇంటి పక్కనే ఉన్న హైటెన్షన్ వైరుకు సీరియల్ వైర్ తగలడంతో షాక్‌కు గురై పడిపోయాడు. కుమారుడి అరుపును గమనించిన తల్లి భారతి హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు సాత్విక్ మృతి చెందినట్టు నిర్ధారించారు. తండ్రి దిలీప్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు, రేపు కళా ఉత్సవ్ పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్)లో గురు, శుక్రవారాలు కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు, ఇంటర్ విద్యార్థులు ఇందులో పాల్గొనడానికి అర్హులని చెప్పారు. ఆరు అంశాల్లో పోటీల్లో ఉంటాయని, శాస్త్రీయ, జానపద, దేశభక్తి గేయాలు, సోలో, ఐదుగురు బృందం పాల్గొనవచ్చన్నారు. సంప్రదాయ బొమ్మల తయారీ సోలో, సంప్రదాయ కథలు చెప్పడంలో ఇద్దరు చొప్పున పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 94414 65299, 90524 23757లో సంప్రదించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, PRAVATH KUMAR GHOSE (New Name) S/o Late Promoth Nath Ghosh, previously called PROBHAT KUMAR GHOSE (Old Name) residing at Plot No. 71, Sri Gayathri Doctor S Nest Phase III, Puduchery, Manlimangalam PO, Kancheepuram, Tamilnadu - 601301. Now changed my name from PROBHAT KUMAR GHOSE (Old Name) to PRAVATH KUMAR GHOSE (New Name). Henceforth I will be called as PRAVATH KUMAR GHOSE (New Name) for all purpose.

CHANGE OF NAME

I, DURGAVAJHALA SATYAVATHI Wife Of Durgavajhala Sreerama Murty Previously Called SATYAVATI VASA Resident of D-19 Sector-20. NOIDA. Gautam Buddha Nagar .U.P PIN : 201301. Now changed my Name from SATYAVATI VASA (Old name) To DURGAVAJHALA SATYAVATHI (New name). Hence forth I will be called as DURGAVAJHALA SATYAVATHI for all purpose.

Services

CHANGE OF NAME

I, SAYYED YUNIS IQUBAL SYED YUNUS IQUBAL (old name) S/o Javeed Iqubal Syed D.No 23-13-2/1, Chinnamvari Street, Near one Town police station, Visakhapatnam 530001. Now I have changed my name as SAYYED YUNIS IQUBAL (new name) Hereafter my name is known as SAYYED YUNIS IQUBAL (New Name) [HA-06691]

GOLD LOANS

లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

TANKER WANTED

తమిళనాడులోని (IOCL BPCL & HPCL) ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఇథనాల్ సరఫరా చేయుటకు, PESO మరియు హజార్డస్ లైసెన్స్ తప్పనిసరి, డ్రైవర్‌తో 40KL SS ట్యాంకర్ కావలెను. సంప్రదించండి: 7823963254 [IA-768]

MindLeaders India
PEOPLE . PERFORMANCE . PROGRESS
MindLeaders Learning India Private Limited
Recruitment of Vocational Trainers (Contractual basis)
Mind Leaders Learning India Private Limited, an NSDC empaneled Training Partner invites application from Domicile of Andhra Pradesh for Vocational Trainers (VTs) for the Electronics trade/sector & Healthcare trade/sector under NSQF Program in 44 Govt. Secondary & Higher Secondary Schools of following districts of Andhra Pradesh & Vocational Coordinator in Andhra Pradesh.
Electronics- Vacancies (40), Districts- Bapatla (10), East Godavari (8) Eluru (5), Tirupati (8), & West Godavari (9)
Qualification: BE/BTech/MTech in Electricals/Electronics as a main subject, Diploma (3 years) in Electronics/ Electricals with 1-year work/ teaching experience. Age Limit: 21-37 years (as on 03/12/2024)
Healthcare- Vacancies (4), Districts- East Godavari (1), Eluru (1), Manyam (1), Visakhapatnam (1)
Qualification: B.Sc. Nursing and Midwifery (4 years) or 3½ years Diploma in GNM with one year experience. Age Limit:- 21-37 years (as on 03/12/2024).
Minimum Competencies for Vocational Trainer: Effective communication Skills (Oral and written) basic computing skills, technical competencies, soft skills, and facilitation skills.Candidate must be able to read and write in Telugu and English Languages.
How to Apply for the Post of Vocational Trainer: Eligible candidates must fill the details in the given Link or scan the QR code, https://forms.gle/inXDmRztug1sqx5H7, last date 12th Dec 2024
Vacancies for the Post of Vocational Coordinator in Andhra Pradesh
Qualification: Masters (3+2 or 4+2) with two year of experience at district level in manager/coordinator position. Agelimit 25-37 years (as on 03/12/2024) How to Apply for the Post of Vocational Coordinator: Eligible candidates must fill the details in the given Link https://forms.gle/bURiGvcaTpoatfpc8, or scan the QR Code, last date 20th dec 2024. Minimum Competencies for Vocational Coordinator: Effective communication Skills (Oral and written) basic computing skills, technical competencies, soft skills, and facilitation skills. Candidate must be able to read and write in Telugu and English Languages. Willing to work at any location within the state. Only shortlisted candidates will be called for the written test. For any Query email on: hr2@mindleadersindia.com, Website- www.mindleadersindia.com

Wanted

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253940]

షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14790]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సీతమ్మధార బ్రాంచ్ (805408)
యూనియన్ బ్యాంక్ బిల్డింగ్, ఈనాడు ప్రక్కన, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు

1(a). శ్రీ. నంజీవి వెంకట గోవింద రాజు, తండ్రి: ఎస్ గణపతి రావు, ఫ్లాట్ నెం.86, డి.నెం. 2-112/1, ఎస్.నెం. 300/1P, బింద్రా నగర్, షిప్‌యార్డ్ లేఅవుట్, పి.యం.పాలెం, మధురవాడ, విశాఖపట్నం-530041. [illegible] 1(b). శ్రీమతి. నంజీవి శోభా రాణి, భర్త: నంజీవి వెంకట గోవింద రాజు, ఫ్లాట్ నెం.86, డి.నెం. 2-112/1, ఎస్.నెం. 300/1P, బింద్రా నగర్, షిప్‌యార్డ్ లేఅవుట్, పి.యం.పాలెం, మధురవాడ, విశాఖపట్నం-530041.

[illegible]

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు (డాక్యుమెంట్ నెం. 1418/2014; 13-03-2014, ప్రకారం శ్రీ నంజీవి వెంకట గోవింద రాజు పేరున గల ఆస్తి). [illegible]

తేదీ: 04.12.2024, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సీతమ్మధార బ్రాంచ్ (805408)
యూనియన్ బ్యాంక్ బిల్డింగ్, ఈనాడు ప్రక్కన, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు

[illegible]

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు

[illegible]

తేదీ: 02.12.2024, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా